www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 30 | అక్టోబర్ | 2026
పేజీలు : 7

గడువుకు ముందే భద్రాద్రి ఆలయాభివృద్ధి పనులు



- నవంబర్ 15 నుంచి రాతికట్టడాల పనులు
- పుష్కరాల నాటికి ఆలయం పట్టణం సర్వాంగ సుందరం
- మంత్రి పొంగులేటి

2 లో

ఖమ్మం ఆర్టీఓలో వసూళ్ల కలకలం..!



- ప్రజాపక్షం వరుస కథనాలతో అధికార యంత్రాంగంలో కదలిక
- మంత్రి పొంగులేటికి కాంట్రాక్టర్ల ఫిర్యాదు?
- అత్యవసర సమావేశంతో తీవ్ర చర్చనీయాంశం
- ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలంటూ పెరుగుతన్న డిమాండ్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ ప్రతినిధి : ఖమ్మం జిల్లా ఆర్టీ కార్యాలయంలో వాహనాల నుంచి నెలవారీగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వెలుగులోకి వచ్చిన ఆరోపణలు ఇప్పుడు అధికార వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. గత మూడు రోజులుగా ప్రజాపక్షం ప్రచురిస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఈ వ్యవహారం ఉన్నతస్థాయి దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అలాగే కాంట్రాక్టర్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై మంత్రి సంబధిత ఓ జిల్లా స్థాయి అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం అత్యవసర కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమావేశం జరిగినట్లు సమాచారం. వాహనాల నుంచి వసూళ్ల ఆరోపణలు, మంత్రికి అందిన ఫిర్యాదు, అత్యవసర భేటీ..ఇలా వరుసగా చోటుచేసుకున్న పరిణామాలు ఆర్టీ కార్యాలయ వ్యవహారిన్న మరింత చర్చలోకి తెచ్చాయి.

మంత్రికి కాంట్రాక్టర్ల ఫిర్యాదు?

కార్యాలయ వ్యవహారాలపై

మిగతా 2లో..

నియోజకవర్గాల్లో నిఘా వర్గాలు



- మంత్రులు, ఎంఎల్ఏల పనితీరుపై ఆరా
- ప్రభుత్వ,అధికారుల పనితీరు పైనా
- మండలానికి 5 గ్రామాల్లో 30 మందితో
- సర్వే ఆధారంగానే ముందడుగు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే దాని కంటే ముందుస్తుగానే వ్యవస్థను సరిచేసుకుంటే మంచిదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు మూడేళ్ల పాలన, పొరపాట్లు, సరిచేసుకోవాల్సిన అంశాలు రానున్న రెండేళ్లలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు,త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రేవంత్ రెడ్డి పైవేటు నిఘా వర్గాలు నియోజకవర్గాల్లో సర్వేకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

పనితీరుపై : మంత్రులు, ఎంఎల్ఏల పనితీరుపై ప్రత్యేక ఆరా తీసేందుకు ఈసర్వే జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వినికిడి. ఇప్పటికే పలు మార్లు ప్రజాప్రతినిధులపై సైలెంట్ సర్వే చేయించిన ముఖ్యమంత్రి వారి లోపాలను ఎత్తి చూపి పనితీరు మార్చుకోవాలంటూ సూచించారనే వార్తలు గుప్పుమంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధానంగా దోహదపడ్డ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ సర్వేకు అత్యంత ప్రాధాన్యంత సంతరించుకునే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముగ్గురు మంత్రులున్న చోట ఎవరి కోట రీ వారిదే అన్నట్లు సాగుతున్న రాజకీయం రాబోయో రోజుల్లో తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్

మిగతా 2లో..

వీడిన హత్య కేసు మిస్టరీ

- 'సామినేని' హత్య కేసులో నిందితులు
- రేపటికి ఏడాది
- వివరాలను వెల్లడించిన సిపి సునీల్ దత్







ప్రజాపక్షం/ ఖమ్మం : ఏడాది తర్వాత హత్య కేసు మిస్టరీ వీడింది. గతేడాది అక్టోబర్ 31న సిపిఎం రాష్ట్ర నాయకులు, ఖమ్మంజిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామం మాజీ సర్పంచ్ సామినేని రామారావు తన ఇంటి వద్దనే హత్యకు గురయ్యాడు. హతుడు రాజకీయ నాయకుడు కావడంతో అప్పట్లో ఈ హత్య కేసు జిల్లాలో సంచలనం సృష్టించింది. హత్య తెల్లవారుజామున జరగడం, హంతకులు ఎవరో గుర్తించకపోవడంతో దర్యాప్తులో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఖమ్మంజిల్లా ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన నలుగురు వ్యక్తులు సామినేని రామారావును హత్య చేసినట్లు పోలీసులు గుర్తించి గురువారం కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో ప్రవేశపెట్టడానికి ముందు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఖమ్మం సిపి సునీల్ దత్ తెలిపిన వివరాల ప్రకారం... సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి చింతకాని పోలీస్ స్టేషన్‌లో బిఎన్ఎస్ సెక్షన్ 103/1, సెక్షన్ 190 క్రింద కేసు నమోదు చేశామని తెలిపారు. క్లూస్‌టీమ్, ఫోరెన్సిక్ సహా ఇతర సాంకేతిక ఆధారాలతో ఆరు బృందాలు దర్యాప్తు నిర్వహించాయన్నారు. సంఘటన స్థలంలో చెప్పులు, కాలి ముద్రలు, ఎరుపు , తెలుపు రంగు కలిగిన రెండు వస్త్రపు ముక్కలు, కత్తి కవర్‌తో పాటు ఇతర భౌతిక ఆధారాలు లభించాయని ఆయన తెలిపారు. మృతుని శరీరంపై ఉన్న గాయాలను, సాక్ష్యాల వాంగ్మూలాలను పరిశీలించడం జరిగిందని సునీల్ దత్ తెలిపారు. నిందితులను గుర్తించేందుకు సాంకేతిక దర్యాప్తు చేపట్టామని 24 మందికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేందుకు న్యాయస్థానం అనుమతి కోరామన్నారు. అనుమానితుల్లో ఆరుగురు మాత్రం స్వచ్ఛందంగా పరీక్షలకు సమ్మతి తెలిపారన్నారు. జనవరిలో బెంగళూరులో వీరికి ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించడం సిపి తెలిపారు. దర్యాప్తులో భాగంగా గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ

మిగతా 2లో..

ఖమ్మం ఆర్టీఓలో వసూళ్ల కలకలం..!

(మొదటిపేజీ తరువాయి)

విసిగివేసారిన కాంట్రాక్టర్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి ఫిర్యాదులు తీసుకెళ్లినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. దీనిపై ఆర్టీఓ కార్యాలయపరిధిలోని క్షేత్ర స్థాయి నుంచి వినపడుతోంది. కాంట్రాక్టర్లు కార్యాలయం నుంచి ప్రభుత్వ పనులకు వాహనాలు వినియోగించిన రక్తం పిండుతున్నారని వాపోయినట్లు తెలిసింది. దీనిపై మంత్రి సంబంధిత జిల్లా స్థాయి అధికారిని పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని మండిపడినట్లు సమాచారం. కాగా ఈ వ్యవహారంపై సాగుతున్న చర్చతో ప్రాధాన్యం సంతరించుకుందనే చెప్పాలి.

అత్యవసర సమావేశం

బుధావరం సాయంత్రం ఆర్టీఓ కార్యాలయంలో అధికారులు అత్యవసరంగా సమావూవేశమైనట్లు తెలిసింది. ఈ సమావేశంలో వసూళ్ల ఆరోపణలు, ప్రస్తుత పరిస్థితిపై చర్చ జరిగినట్లు క్షేత్రస్థాయి నుంచి వినికిడి. అలాగే జిల్లా కార్యాలయ పరిధిలోని సంబంధిత ఇరత కార్యాలయాల్లో అవినీతి వ్యవహారాలకు దూరంగా ఉండాలని చర్చించుకున్నట్లు విశ్వనీయ సమాచారం. వీటన్నింటికి ప్రధాన కారణం ప్రజాపక్షం వరుసగా ప్రచురించిన కథనాలే అనేది అక్షర సత్యంగా కనిపించింది. అయితే ఈ వ్యవహారంలో తెర వెనుక ఉన్న అసలు లెక్కలపై పలు ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.

అవినీతిపై చర్యలుండేనా?

ఒక వైపు వాహనాల నుంచి నెలవారీ వసూళ్ల ఆరోపణలు, మరోవైపు కాంట్రాక్టర్ల ఫిర్యాదులు, ఇంకో వైపు అధికారుల అత్యవసర సమావేశంతో అవినీతిపై చర్యలుండేనా? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. ఈ పరిణామాల ఇంతలో చర్చనీయాంశంగా మారిన తరుణంలో అసలు వాస్తవాలను సుమోటోగా తీసుకున్ని నిగ్గు తేల్చాలనే వాదన బలంగా వినిపిస్తోంది. రోజులు వారి కార్యాలయంలో జరగుతున్న పనులు ఎన్ని ఫైల్లు పాస్ అవుతున్నాయి. ఇందులో ఏమైనా అనధికారి వసూళ్లకు పాల్పడుతున్నారా? అనేది స్పష్టం చేయాల్సిన అవశ్యక్తను నొక్కి చెబుతోంది. ఈ నేపథ్యంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన వ్యవహారాలపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలనేది కీలకంగా మారింది.

వీడిన హత్య కేసు మిస్టరీ

(మొదటిపేజీ తరువాయి)

నిపుణుల సాయం తీసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ విశ్లేషణ అనంతరం దర్యాప్తులో సేకరించిన భౌతిక, సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని విశ్లేషించి నలుగురు నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారు పల్లి గ్రామానికి చెందిన బోడపట్ల శ్రీనివాసరావు అలియాస్ మెంటల్ శ్రీను, అదే గ్రామానికి చెందిన నూకల లింగయ్య, మల్లారపు లక్ష్మ య్య, కర్లపూడి ఉదయ్‌కుమార్ అలియాస్ రుక్మాన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు సిపి తెలిపారు. వీరితో పాటు హత్యకు ఉపయోగించిన రెండు కత్తులను, నిందితులు రెక్కీ నిర్వహించే సమయంలో ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్న నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సిపి సునీల్ దత్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ వీరిలో ముగ్గురికి నేర చరిత్ర ఉందని గతంలో తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులోనూ చౌటుప్పల్ వద్ద జరిగిన ఒక హత్యాయత్నం కేసులోనూ నిందితులుగా ఉన్నారన్నారు. హత్యకు గల కారణాలు ఏమిటని మీడియా ప్రశ్నించగా ఒక వ్యక్తితో ఉన్న ఆర్థిక, రాజకీయ వ్యవహారాల కారణంగా హత్య జరిగిందని మరిన్ని వివరాలను పూర్తి దర్యాప్తు తర్వాత వెల్లడిస్తామన్నారు. రామారావు హత్య జరిగి రేపటికి ఏడాది అవుతున్న నేపథ్యంలో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఇప్పటికే సిపిఎం సామినేని రామారావు వర్ధంతి సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి నిందితుల అరెస్టు తర్వాత కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. సిపిఎం ఆరోపించినట్లు సామినేని హత్య కేసులో కాంగ్రెస్ కార్యకర్తలెవరిని అరెస్టు చేయకపోవడం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. నిందితులందరూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీర భద్రం స్వగ్రామానికి చెందిన వారు కావడం కూడా రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు దారితీస్తుంది. ఇప్పుడు అరెస్టు చేసిన నిందితులు నలుగురిలో ముగ్గురు 2023 ఆగస్టు 15న జరిగిన అప్పటి బిఆర్ఎస్ నాయకుడు తెల్దారుపల్లికి చెందిన తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులో ఉండటం గమనార్హం. మీడియా సమావేశంలో దర్యాప్తు అధికారులు వైరా ఏసిపి సారంగపాణి పాల్గొన్నారు. హత్య కేసు దర్యాప్తులో వైరా సిఐ వెంకటప్రసాద్ తో పాటు పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొనగా వారందరినీ సిపి అభినందించారు.

న్యాయాన్ని హత్య చేసిన సిపి

-ఉపముఖ్యమంత్రి భట్టి కోసమే అమాయకులపై కేసులు
-సిపిఎం నేత తమ్మినేని

ప్రజాపక్షం/ చింతకాని : ఖమ్మం సిపి సునీల్ దత్ సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి న్యాయాన్ని హత్య చేశారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సామినేని రామారావు హత్య కేసులో పోలీస్ దర్యాప్తు సరైన రీతిలో సాగలేదని ఆయన తెలిపారు. గురువారం పాతర్లపాడు గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ రామారావు సిపిఎం పార్టీలో వివిధ హోదాలలో పని చేశారని ఆయన ఆశయ సాధన కోసం సిపిఎం కృషి చేస్తుందన్నారు. గతేడాది అక్టోబర్ 31న సామినేనిని దారుణంగా హత్య చేస్తే అసలు ముద్దాయిలను వదిలి అమాయకులను పోలీసులు అరెస్టు చేశారని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని నమ్మరని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను రక్షించేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాలతో పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని తమ్మినేని తెలిపారు. న్యాయం కోసం పోరాడతామన్నారు. ఇదిలా ఉండగా సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు హంతకులను కాపాడేందుకు ఒక క్రైమ్ స్టోరీ వినిపించారన్నారు. సామినేని రామారావు సతీమణి కొన్ని పేర్లు చెప్పినప్పటికీ వారిని విచారించలేదన్నారు. పోలీసుల తీరుపై తమకు ఎలాంటి నమ్మకం లేదని అందుకే సిట్ చేత దర్యాప్తు జరిపించాలని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి సైతం ఈ విషయంలో మాట తప్పారని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి ఉపేందర్, స్థానిక సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.



లంబాడీల హక్కులు సాధించాలి..చేవెళ్ల డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్



ప్రజాపక్షం/వైరా: గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన దళం–తండాలో నిద్ర కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా అధ్యక్షుడు భూక్యా నరసింహానాయక్ ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు ముఖ్యంగా లంబాడీ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల గిరిజన డిక్లరేషన్‌లోని హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు ప్రాతినిధ్యం కల్పించి మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. ఎస్టీ, ఎస్సీ, బిసి వర్గాలకు చెందిన రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేస్తూ, గిరిజనుల హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. వైరాలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ పేరిక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల సాధన కోసం సేవాలాల్ సేన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈసమావేశంలో సేవాలాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లకావత్ భాస్కర్‌నాయక్, ఎస్సీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వినోద్‌కుమార్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షుడు లకావత్ దేవేందర్ నాయక్‌తో పాటు పలువురు సేవాలాల్ సేన నాయకులు గిరిజన సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువుకు ముందే భద్రాద్రి ఆలయాభివృద్ధి పనులు

ప్రజాపక్షం/భద్రాచలం : గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు పనులను అనుకున్న గడువుకంటే 10రోజుల ముందే పూర్తి చేస్తామని నవంబర్ 15 నుండి రాతికట్టడాల పనులు ప్రారంభమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆలయాన్ని సందర్శించుకున్న మంత్రి ఎంఎల్‌ఏలు డా. తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు జారే ఆదినారాయణ కలెక్టర్ అంకిత్ ఎస్‌పి రోహిత్‌రాజ్ తదితరులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయ పనులను వేగవంతం చేసేందుకు ఆర్‌అండ్‌బి దేవాదాయ శాఖ అధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే కొన్ని స్లాబుల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన కాంక్రీట్ మాడవీధుల పనులను సమాంతరంగా చేపడుతున్నట్లు చెప్పారు. కొండపై రాతి తొలగింపు పనులను స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా నిర్వహిస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి ఆలయంతో పాటు పుష్కరఘాట్లను అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులుకల్పిస్తామని పేర్కొన్నారు. బాసర నుండి భద్రాచలం వరకు ప్రధాన ఆలయాలను అనుసంధానిస్తూ ప్రత్యేక ఆలయ పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పట్టణంలో వర్షపునీరు నిల్వలు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ రాహుల్, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ దేవస్థానం ఇఓ దామోదర రావు ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల్లో నిఘా వర్గాలు

(మొదటిపేజీ తరువాయి) ఎంఎల్‌ఏలు వారి అనుచర గణం ఆయా నియోజకవర్గాల్లో ఏం చేస్తున్నారు. ప్రజల నుండి వారి పట్ల ఏ విధమైన స్పందన ఉంది అనేవి కూడా సర్వేలో చోటు చేసుకోనున్న ప్రశ్నలు. అంతే కాకుండా ప్రభుత్వ పనతీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు. అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో వస్తున్న ప్రతికూల అనుకూల స్పందన, పథకాలు అమలు చేయాల్సిన అధికారుల పనితీరు తదితర అంశాలపై కూడా స్పష్టమైన నిఘా సర్వే సాగే అవకాశమున్నట్లు వినికిడి.

ప్రతీ మండలంలో : జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాల పరిధిలోని 23 మండలాల్లో ఈ సర్వే సాగనుంది. ప్రతీ మండలం నుండి ఐదు గ్రామాలకు ఇప్పటి నిఘా వర్గాలు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రతీ గ్రామం నుండి 30 నుండి 40 మంది అన్ని వర్గాల ప్రజలను ప్రశ్నించి వారి నుండి సమాధానాలు రాబట్టే ప్రైవేటు సైన్యం, నివేదికలు తయారు చేసి రాష్ట్ర ఇంటిలిజెన్స్ వర్గాలకు అందిస్తాయి. ఆ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి అందించనున్నారు. రాబోయే రోజుల్లో అధికారాన్ని చేజార్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొరపాట్లపై దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు పలువురు అంటున్నారు. ఇదిలా ఉండగా ప్రజారంజక పాలన సాగించేందుకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, నూతన ప్రథకాలు ప్రవేశపెట్టే అంశాలను పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వ్యభిచార గృహంపై దాడి

ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం : నగరంలోని ముస్తఫానగర్ ప్రాంతంలో వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు నిర్వహించారు. సిపి సునీల్ దత్ ఆదేశాల మేరకు సిఐ శివనాధుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏహెచ్‌టియు బృందం సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు మహిళలను రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా, వ్యభిచార గృహాల నిర్వహణకు సంబంధించి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని తెలిపారు.

పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోండి



ప్రజాపక్షం/మధిర: పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా జెడ్పీ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జి లింగాల కమల్‌రాజు మధిర పట్టణంలోని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకొని ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మధిర పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు పర్యటించి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఎంపిడిఓ, ఎమ్మార్వో, కోర్టు విద్యాసంస్థల్లో పర్యటించి పట్టభద్రులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు పల్లపోతుల వెంకటేశ్వరరావు, అరిగే శ్రీనివాసరావు, కౌన్సిలర్ వైవి.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ఐలూరి ఉమామహేశ్వరరెడ్డి, ఆళ్ల నాగబాబు, పెద్దపూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌వో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి ఎంఆర్‌వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ తల్లాడ మండలంలో గతంలో సమృద్ధిగా వర్షపాతం నమోదైన సమయంలో వరి, పత్తి, మిర్చి, కంది, పెసర తదితర పంటలు బాగా పండేవని తెలిపారు. నేడు రైతులు ఏ పంట పండించినా ఆశించిన దిగుబడులు, ఆదాయం వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణ కృష్ణయ్య, పులి కృష్ణయ్య, నరేష్, షేక్ మస్తాన్, అనుమల కృష్ణయ్య, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

ఆసుపత్రులను పిఎం రాహత్ పథకంలో నమోదు చేయాలి



-రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు
-హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
-రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య సేవలను అందించి వారి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా అమలు చేస్తున్న పిఎం రాహత్ పథకం క్రింద జిల్లాలోని ఆరోగ్యశ్రీ జాబితాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఎం రాహత్ పథకం నోడల్ అధికారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పథకం లక్ష్యాలు, అమలు విధానం, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పరిధిలోని 60 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు పిఎం రాహత్ పోర్టల్‌లో నమోదు చేయించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం నాటికి పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల ప్రతినిధులు అవసరమైన పత్రాలతో హాజరు కావాలన్నారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కలెక్టరేట్‌లో పది ప్రత్యేక కంప్యూటర్లను ఏర్పాటు చేసి ఆదివారం నాటికి ట్రయల్స్ పూర్తి సోమవారం నాటికి వంద శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు కూడా నమోదు చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. ప్రమాదం జరిగిన మొదటి వారం రోజులు అత్యంత కీలకమని డబ్బు లేక చికిత్స ఆగకూడదనే ఉద్దేశంతో బాధితులకు ఏడు రోజుల వరకు గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 112 అత్యవసర నెంబర్‌కు సమాచారం ఇచ్చేలా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలు (బ్లాక్ స్పాట్లు), సమీప ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను జియో ట్యాగింగ్ చేసి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని 108 అంబులెన్స్‌లకు వెహికిల్ ట్రాకింగ్ పరికరాలను అమర్చి క్షతగాత్రులను ఆలస్యం లేకుండా సమీపంలోని మెరుగైన వసతులు ఉన్న ఆసుపత్రికి చేర్చేలా కమాండ్ కంట్రోల్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారిపై మితిమీరిన వేగం వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయని ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రమాద తీవ్రత గల ప్రాంతాలను గుర్తించి అధునాతన ట్రాఫిక్ నిఘా వ్యవస్థను (స్పీడ్ గన్స్, సిసి కెమెరాలు) సమర్థవంతంగా వినియోగించాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ పిఎం రాహత్ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి శ్రీనివాసులు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/చింతకాని : వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన చింతకాని మండల రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్ర బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాగిలిగొండ సీపిఐ శాఖా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో చింతకానికి చోటు కల్పించకపోవడం వల్ల ఇక్కడి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటల సాగు కోసం వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, మరోవైపు యాసంగి సాగు అగమ్యగోచరంగా ఉందని దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకుని తగిన పరిహారం అందించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు మంజూరీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, నాయకులు షేక్ హుస్సేన్, దమ్మాలపాటి రవీంద్ర, జాన్, పంది పుల్లయ్య, శేఖర్, ఆనందం, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య,గోపీ, పుల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బికేఎంయు కల్లూరు మండల కన్వీనర్‌గా కొత్తపల్లి





ప్రజాపక్షం/కల్లూరుః తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు కల్లూరు మండల కన్వీనర్‌గా కొత్తపల్లి వెంకటనారాయణ కోకన్వీనర్‌గా భానోత్ రేణుక లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్ధినేని కరుణకుమార్ తెలిపారు. బుధవారం జరిగిన ఉపాధి హామీ నియోజవర్గ సదస్సు బికేఎంయూ బి కే ఎం యు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని 9 మందితో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కమిటీ సభ్యులుగా రామకృష్ణ, ధనమ్మ, కృష్ణ, వెంకటరమణ, నరసింహారావు, సుమిత్ర ,వెంకటేశ్వర్లుతో కలిపి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఈ నూతన కమిటీ వ్యవసాయ కూలీలు ఉపాధి కూలీల సమస్యలపై కల్లూరు మండల పట్టణ సమస్యలపై నిరంతరం పోరాటాలకు సిద్ధం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి బి కే యం యు ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆది నారాయణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై రైతులకు అవగాహన



-పలు గ్రామాల్లో గ్రామసభలు
-గ్రామస్తులు, రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్యాకేజీ 4 పరిధిలో రఘునాథపాలెం మండలంలో ఎల్ఎం15 కాలువ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని మంచుకొండ, కోయచలక, రేగులచలక, చిమ్మపుడి గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ, ఐఅండ్‌పి రైల్వేస్) జి. సదానందం, రఘునాథపాలెం తహసీల్దార్ ఎస్. శ్వేత, నీటిపారుదల శాఖ డిఈఈ జి. మోతీలాల్ తదితరులు పాల్గొని భూసేకరణ ప్రక్రియపై రైతులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి చేపట్టనున్న భూసేకరణ నిబంధనలు, పరిహార ప్రక్రియ, విధి విధానాలపై రైతులకు, భూ యజమానులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు, రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలను, సందేహాలు, అభ్యంతరాలను నమోదు చేసుకున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం న్యాయబద్ధమైన ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. భూసేకరణకు సంబంధించి త్వరలో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలువ నిర్మాణానికి సంబంధించి నాలుగు గ్రామాల పరిధిలో సుమారు 113 ఎకరాలు భూసేకరణ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భూసర్వే అనంతరం సర్వే నెంబర్ల వారీగా ఎంత మేర భూసేకరణ చేపట్టనున్నది తెలుస్తుందన్నారు. భూసేకరణకు రైతులు కూడా సహకరించాలని అధికారులు కోరారు.ఈ సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు తేజావత్ శంకర్, కోటేరు నర్సిరెడ్డి, బలుసుపాటి శేషయ్య, యండపల్లి రమాదేవి, ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, ఆయా శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు



ప్రజాపక్షం/సత్తుపల్లిః రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ టీజీఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో సత్తుపల్లిలో నిర్వహిస్తున్న 73 వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. గురువారం జరిగిన పోటీలను మువ్వా విజయబాబు కుటుంబ సమేతంగా వీక్షించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులు హోరాహోరీగా తలపడుతూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

రెండో రోజు మ్యాచ్‌ల ఫలితాలు...

సిద్దిపేట 3533 హనుమకొండ, హైదరాబాద్ 315 ఆదిలాబాద్, రంగారెడ్డి 494 యాదాద్రి భువనగిరి, వరంగల్ 3935 నిర్మల్, ఖమ్మం 408 సంగారెడ్డి, నల్గొండ 406 భూపాలపల్లి, జనగామ 3613 హైదరాబాద్1, ఆసిఫాబాద్ 5343 హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం 45 12 కరీంనగర్, సిద్దిపేట 4236 సిరిసిల్ల, సూర్యాపేట 3612 మెదక్, మహబూబ్‌నగర్ 3836 ములుగు, నిజామాబాద్ 3231 నాగర్‌కర్నూల్, జగిత్యాల 2820 నారాయణపేట, వనపర్తి 30 29 మంచిర్యాల, గద్వాల 3713 సిద్దిపేట.మహిళా క్రీడాకారిణులకు ప్రోత్సాహం అందిస్తూ నిర్వహిస్తున్న ఈ పోటీలు సత్తుపల్లిలో క్రీడా సందడిని నెలకొల్పాయి. రాష్ట్రస్థాయి క్రీడా వేదికలతో పట్టణ ఖ్యాతి మరింత విస్తరిస్తోందని క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగుకు గోదావరి జలాలే శరణ్యం



-సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి
-ఏఐకెఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి


ప్రజాపక్షం/బోనకల్: ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగానికి గోదావరి జలాలే శరణ్యమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకెఎస్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన ఆర్థిక, మౌలిక వనరులను కల్పించి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. వ్యవసాయ కూలీల కొరతను అధిగమించేందుకు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడద కారణంగా కూరగాయల సాగుకు రైతులు దూరమవుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు పారుపల్లి నరసింహారావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కొమ్మినేని వెంకటేశ్వరరావు, మడుపల్లి వెంకటేశ్వర్లు, వంగాల నరసింహ, పారుపల్లి రాఘవులు, గుడిద కృష్ణ, కొంగర కృష్ణయ్య, ఏలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ మొక్కలకు పశువుల బెడద



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై హైవేలపై యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డివైడర్లలో కొత్తగా నాటిన మొక్కలను పశువులు తినేస్తుండటంతో పట్టణ సుందరీకరణకు ఆటంకం కలగుతోంది. రహదారులపై పశువుల సంచారం వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ఈసమస్యపై మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు ఆదేశాల మేరకు రోడ్లు, హైవేలపై తిరుగుతున్న పశువులను పట్టుకుని మున్సిపాలిటీ పరిధిలో నిర్దేశించిన ప్రదేశంలో కట్టేశారు. అనంతరం పశువుల యజమానులను పిలించి కౌన్సిలింగ్ ఇచ్చి పశువులను రోడ్లపై వదలకుండా బాధ్యతగా చూసుకోవాలని సూచిస్తూ వాటిని అప్పగించారు. డివైడర్లలో నాటిన మొక్కలను కాపాడటంతో పాటు రహదారులపై పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు ఈ చర్యలు చేపట్టారు.

స్ట్రోక్‌లో ప్రతి నిమిషం విలువైనదే..!



-లక్షణాలను గుర్తించాలి
-చికిత్సలో ఆలస్యం చేయొద్దు
-డాక్టర్ గట్టినేని సురేష్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్, స్తంభాద్రి హాస్పటల్, ఖమ్మం
-ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం పురస్కరించుకొని ప్రజాపక్షం ప్రత్యేక కథనం

ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ప్రపంచ వ్యాప్తంగా ప్రజారోగ్యానికి సవాళుగా మారుతున్న సమస్యల్లో పక్షవాతం(స్ట్రోక్) ఒక్కటి. మెదడుకు రక్తప్రసరణలో అంతరాయం ఏర్పడినప్పుడు లేదా మెదడులోని రక్త నాళం చీట్లినప్పుడు పక్షవాతం సంభవిస్తుంది. దీనివల్ల మెదడు కణాలకు ఆక్సిజన్ అందక నష్టం కలుగుతుంది. సకాలంలో వైద్యం అందక పోతే ప్రాణపాయంతో పాటు శాశ్వత వైకల్యం సంభవించే ప్రమాదం ఉంది. అందుకే స్ట్రోక్ లక్షణాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, బాధితులకు తక్షణం వైద్యం అందించడం అత్యంత కీలకం.

-లక్షణాలను గుర్తించడమే తొలి అడుగు

మొఖం ఒక వైపు వాలిపోయి ఉండడం, ఒక చేయి లేదా కాలు ఆకస్మాత్తుగా బలహీన పడడం, మాట తడబడటం లేదా మాట్లాడలేకపోవడం స్ట్రోక్ ప్రమాద హెచ్చరిక సంకేతాలు. వీటితో పాటు చూపు తగ్గడం, నడవడంలో ఇబ్బంది, సమతుల్యత కోల్పోవడం, ఆకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి రావడం వంటి లక్షణాలు కూడా కన్పించవచ్చు. ఈ లక్షణాలు కన్పించిన వెంటనే అత్యవసర వైద్య సదుపాయం పొందాలి. కొద్ది సేపటికే లక్షణాలు తగ్గిపోయిన నిర్లక్ష్యం చేయకూడదు.

-ప్రతి నిమిషం ప్రాణధారమే..

స్ట్రోక్ చికిత్సలో సమయం అత్యంత కీలకం. లక్షణాలు ప్రారంభమైన సమయాన్ని గుర్తించుకొని బాధితుడిని వెంటనే స్ట్రోక్ చికిత్స అందించే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించి, స్ట్రోక్ రకాన్ని నిర్ధారించిన అనంతరం తగిన చికిత్సను అందిస్తారు. అర్హులైన రోగులకు పరిస్థితులు బట్టి రక్తం గడ్డను కరిగించే మందులు లేదా ప్రత్యేక వైద్య ప్రక్రియను తొలగించే చికిత్సను అందించవచ్చు. సొంత వైద్యం చేయడం, వైద్యుల సూచనలు లేకుండా ఆస్పిరిన్ మందులు ఇవ్వడం ప్రమాదకరం.

-ముంపును పెంచే అంశాలు..

అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, పొగతాగడం, గుండె సంబంధిత సమస్యలు, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతాయి. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. వైద్యులు సూచించిన మందులను సక్రమంగా వాడుతూ, సమతుల్య ఆహారం తీసుకోవాలి. రోజువారీ వ్యాయామం, పొగాకు వినియోగానికి దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా స్ట్రోక్ ముంపును తగ్గించవచ్చు.

-లక్షణాలు కన్పిపిస్తే వైద్యులను సంప్రదించాలి
డాక్టర్ గట్టినేని సురేష్, ప్రముఖ కన్సల్టెంట్ న్యూరో సర్జన్, స్తంభాద్రి హాస్పటల్, ఖమ్మం



పక్షవాతం వచ్చినప్పుడు సమయం మించిపోకుండా చూసుకోవటం కీలకం. అందువల్ల ఏది పక్షవాతం, ఏది కాదని తెలుసుకొని ఉండటం..పక్షవాతం వచ్చినట్టయితే ఏం చేయాలో అవగాహన కలిగిఉండటం, సత్వరం స్పందించటం, వీలైనంత త్వరగా అత్యవసర చికిత్స సదుపాయాలు గల సమీప ఆసుపత్రికి తీసుకెళ్లటం చాలా ముఖ్యం. అసలు ఈ ఆపద తలెత్తకుండా సమతులాహారం తినటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, బరువు అదుపులో ఉంచుకోవటం, పోగాకు, మద్యం అలవాట్లకు దూరంగా ఉండటం,కంటి నిండా నిద్ర పోవడం, అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నట్లయితే విధిగా మందులు వేసుకోవటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవి పక్షవాతం ముప్పు తగ్గటానికి తోడ్పడతాయనే సంగతి మరువరాదు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి

-లక్ష్మీ పురంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం
-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/బూర్గంపాడు: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, పంట నష్టాలను తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని పినపాక ఎంఎల్ఏ, తెలంగాణ శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని, పంటల సాగు, సంరక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి యాజమాన్యం, తెగుళ్లు, చీడపీడల నివారణకు వ్యవసాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు. పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, పత్తి నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా రైతులకు అవసరమైన సమాచారం, మార్గదర్శకతం అందించి పంట నష్టాలను తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికారి ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బట్టా విజయ్‌గాంధీ, సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి, ఏడీఏ తాతారావు, ఎంపీడీవో జమలారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తోలెం కళ్యాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి శారత, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాభివృద్ధి



ప్రజాపక్షం/కారేపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే గ్రామాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందని వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం మొట్లగూడెంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మాణిక్యారం క్లస్టర్ పరిధిలోని 10 గ్రామ పంచాయితీల సర్పంచులు, అధికారులతో అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా నివేదికలు తెప్పించుకుని పనుల పురోగతిని సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. అధికారులు తమ శాఖల పరిధిలో అవసరమైన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు పంపించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు అధికారులతో గౌరవంగా మెలుగుతూ పనులు పూర్తి చేయించుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈసమావేశంలో ఎంపీడీవో బి పద్మ, తహసీల్దార్ ఓ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సర్పంచులు సుజాత, పెంటయ్య, మంగ, రంజిత్, హీరాలాల్, టోనీ, హేమలత, భద్రం, ఎల్లయ్య, మాజీ ఎంపీపీ మంజుల, దేవుల, సొసైటీ మాజీ ఛైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, భీముడు, అర్జున్‌రావు, భావ్‌సింగ్, ఐలయ్య, పుల్లారావు, ఉమాశంకర్, రూపుల, ఉపేందర్, షఫీ, మజ్జు, గాంధీ, పవన్, హనీఫ్, రాములు, నిర్మల, రాజు, సెట్‌రాం, నవీన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకొరిగిన వరి పంట పరిశీలన



ప్రజాపక్షం/కూసుమంచి: వర్షానికి నేలకొరిగిన వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పరిశీలించారు. కూసుమంచి మండలంలో కూసుమంచి, కిష్టాపురం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వర్షం వల్ల జరిగిన పంట నష్టంపై ప్రాథమిక అంచనా రూపొందిస్తామని తెలిపారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఎలినినో ప్రభావం నేపథ్యంలో యాసంగిలో వరి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ కాలపరిమితి, తక్కువ నీటితో సాగు చేయగల అపరాలు, నూనె గింజల పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాకుడు రాజేష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, కూసుమంచి క్లస్టర్ ఏఈఓ జానీ బాబా, రైతులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- పంచాయితీలను తనిఖీ చేసిన జిల్లా పంచాయితీ అధికారి



ప్రజాపక్షం/పాల్వంచ : విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని జిల్లా పంచాయితీ అధికారి బి. అనూష అన్నారు. మండల పరిధి రంగాపురం, నాగారం గ్రామ పంచాయితీలతో పాటుగా జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం ఆకస్మికంగా సంధర్శించారు. ఈ సంధర్భంగా పంచాయితీలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వాహణను, క్రిమిటోరియం, నర్సరీ, డంపింగ్ యార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.పంచాయితీ రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యదర్శులు పంచాయితీ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, డంపింగ్ యార్డులు, క్రిమిటోరియంలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వాహణకు అత్యంత ప్రాధాన్యతనివ్వటంతో పాటు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి షేక్ షబ్నా, రంగాపురం, నాగారం సర్పంచులు మాలోత్ అనిత, ధరావత్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రారంభ దశలోనే పరిష్కరించుకోవాలి

- డిప్యూటి డిఎంహెచ్ఓ



ప్రజాపక్షం/పాల్వంచ : కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి అందుకు తగిన వైద్యం తీసుకొని పరిష్కరించుకోవాలని డిప్యూటి డిఎంహెచ్ఓ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రతాప్ అన్నారు. పాలకోయతండా, నవభారత్ తదితర ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఆర్‌బిఎస్‌కే కంటి పరీక్షల కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం బిడికే చిట్టి రామవరం కేంద్రాన్ని, రామవరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సంధర్శించి రికార్డులు, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. కేంద్రానికి సంభందించిన ఫిర్యాదులపై ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించారు.డిఈఐసి, ఎస్ఎన్‌సియు, జీరో డోస్ వ్యాక్సినేషన్ విభాగాలను పరిశీలించారు. నవజాత శిశువులకు సకాలంలో వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌సియు మెడికల్ ఆఫీసర్ వినోద్, సిహెచ్ఓ నాగభూషణం, డిపిఓ సలిత, సంభందిత వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడును కరువు మండలంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలంపై అధికార పార్టీ సవతితల్లి ప్రేమను ఓలకబోస్తుందని సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. జూలూరుపాడు ను కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వానాకాలంలో ఆశించిన వర్షాలు కురవలేదని, దీంతో బావులు, బోర్లలో సాగునీరు అందక రైతులు సాగుచేసిన పంటలకు సరైన దిగుబడి రాలేదన్నారు. యాసంగిలో ఆరుతడి పంటలకు సైతం సాగునీరు అందని పరిస్థితి మండలంలో నెలకొందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రైతుల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయడం తగదని, జూలూరుపాడు మండల రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఐ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం సాగిస్తుందని డిమాండ్ చేశారు. ఈ సమవేషంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య, ఎల్లంకి మధు, పొనేకంటి వెంకటేశ్వర్లు, వలమల్ల సామేలు, చీమకుర్తి సంతోష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/ఇల్లందు: కాచనపల్లికి చెందిన వెనక వీరస్వామి ఇల్లందు పట్టణంలోని బాలాజీ స్వీట్ హోమ్ సమీపంలో గుండె నొప్పితో ఆకస్మాత్తుగా కుప్పకూలారు. వెంటనే స్పందించిన స్వీట్ హోమ్ యజమానులు ఆయనకు సీపీఆర్ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది వీరస్వామిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఎల్‌నినో నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- నీటి సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు..
చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలి
- నీటి పొదుపు ప్రభుత్వానేదేకాదు, ప్రజల బాధ్యత కూడా
జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి నీటి చుక్కను సంరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని చింతపల్లి గ్రామ పంచాయతీలో ఎల్‌నినోపై అవగాహన గ్రామసభను నిర్వహించారు. తొలుత కలెక్టర్‌కు పంచాయతీ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నీటి సంరక్షణ, చిరుధాన్యాల సాగు ప్రాధాన్యతను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని అవగాహణ కల్పించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ నీటితో సాగు చేసేందుకు అనువైన చిరాధాన్యాల పంటలపై అవగాహన పెంచుకోవాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా వ్యవసాయంలో ఎదురయ్యే నష్టాలను కొంతవరకు తగ్గించుకోవచ్చనే అంశాన్ని పేర్కొన్నారు. నీటి సంరక్షణ అనేది ఒక్క ప్రభుత్వశాఖకే పరిమిత బాధ్యత కాదని, ప్రజలందరూ భాగస్వాములైనప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరెంపుల మరియమ్మ, తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి, ఎంపిడీఓ రవికుమార్, ఐబిడిఈ రాజేష్, వ్యవసయశాఖ ఏవో ఉమానాగేష్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, బిఆర్ఎస్ నాయకులు ముత్యం పెద్ద కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రూత్ సంకల్పం స్ఫూర్తి దాయకం



-హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్
-మెడిసిన్‌లో యండి పూర్తి చేసిన
తొలి ట్రాన్స్ మహిళగా రూత్ ఘనత

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పేదరికం, సామాజిక వివక్షను అధిగమించి వైద్య రంగంలో అరుదైన ఘనత సాధించిన డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ అందరికీ స్ఫూర్తిదాయకమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ కొనియాడారు. సిపి విసి సజ్జనార్‌ను రూత్ జాన్‌పాల్ గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిపి సజ్జనార్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని 58వ డివిజన్‌కు చెందిన రూత్ జాన్‌పాల్ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో చదువుకుని ఎమర్జెన్సీ మెడిసిన్‌లో యండి పూర్తి చేయడం అభినందనీయమన్నారు. దేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి ట్రాన్స్ మహిళగా నిలిచారని సజ్జనార్ తెలిపారు. ఒకప్పుడు వ్యవసాయ కూలీగా పని చేస్తూ వివక్షను ఎదుర్కొన్న ఆమె న్యాయ పోరాటం చేస్తూ తన లక్ష్యాన్ని చేరుకోవడం అసాధారణ విజయమన్నారు. ప్రస్తుతం సనత్ నగర్ ఈఎన్ఐ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో వైద్యురాలిగా సేవలు అందిస్తూ ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగితే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని రూత్ జాన్‌పాల్ నిరూపించారని సజ్జనార్ ప్రశంసించారు. ఆమె భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



నూతన సబ్‌స్టేషన్లు, కార్యాలయాల భవనాలను
పరిశీలించిన సిఎండి వరణ్‌రెడ్డి



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలోని అశ్వారావుపేట ప్రాంతంలో పర్యటించిన ఆయన పలు విద్యుత్ సబ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా విస్తరణ నూతనకార్యాలయ భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, సర్వే టెండర్ ప్రక్రియలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కొనసాగుతున్న పనులన్నింటిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అశ్వారావుపేట2 సబ్‌స్టేషన్ల పరిధిలోని నందమూరి కాలనీలో నిర్మిస్తున్న 220/132, 33/11 ఇతర నూతన సబ్‌స్టేషన్ పనులను సిఎండి పరిశీలించారు. ఈ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్థానిక విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచాలని తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సిఎండి సమావేశమయ్యారు. అశ్వారావుపేట ప్రాంతంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, కార్యాలయ భవనాల నిర్మాణం, విద్యుత్ సరఫరా తదితర సంబంధిత అంశాలపై పరస్పరం చర్చించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు ముందుగానే సిద్ధం చేసుకోవడం, సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించివచ్చని సిఎండి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మధిరలో అఘోర సాధువుల సందడి



ప్రజాపక్షం/మధిర: మధిర పట్టణంలో గురువారం అఘోర సధువుల సందడి నెలకొంది. ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు చెందిన బాబా ప్రేమ్ గిరి అఘోర సాధువు పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న అంబికా ఫ్యాన్సీ దుకాణాన్ని సందర్శించి యజమానులను ఆశీర్వదించారు. విషయం తెలియడంతో పట్టణంలోని పలువురు వ్యాపారులు అఘోర సాధువును తమ దుకాణాలకు ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అఘోర సాధువును చూసేందుకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరిచారు. ఆయన విభూత్న వేషధారణ, ఆశీర్వచన తీరు స్థానికులను ఆకట్టుకుంది. దీంతో మెయిన్ రోడ్డులో కొద్ది సేపు సందడి వాతావరణం నెలకొంది.

పట్టభద్రులకు అభివృద్ధిని వివరించండి



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపడుతున్న అభివృద్ధిని పట్టభద్రులకు వివరిస్తూ ఓటరు నమోదు చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుమ్మల యుగంధర్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన పట్టభద్రుల వివరాలను సేకరించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. గతంలో పట్టభద్రుల ఓట్లు ఉన్న మరల ఓటు నమోదు చేసుకోవడం తప్పనిసరి అన్నారు. ఇంకా ఓటరుగా నమోదు కానీ వారిని గుర్తించి దరఖాస్తు చేసేలా నాయకులు, కార్యకర్తలు చూడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ పట్టభద్రులు ఎంఎల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డికి ఓటు వేసేలా చూడాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే క్యాంపు కార్యాలయంలో తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు దేవ్‌సింగ్, సర్పంచ్ గాజుల కృష్ణారావు, నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, బోయన వెంకటనర్సయ్య, మందా వెంకటయ్య, నంద్యా, రామ్మూర్తి, బానోత్ కోటేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చింతకానిని కరువు మండలంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చింతకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని రైతాంగం వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయారని , కైలు రైతులు పరిస్థితి మరింత అగమ్యగోచరంగా ఉందన్నారు. పముఖ్యమంత్రి ఇలాకాలో చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. డిప్యూటీ సీఎం చొరవ తీసుకొని తక్షణమే చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం రేషన్ బియ్యంతో పాటు ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కరుణశ్రీ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దేశబోయిన ఉపేందర్, పార్టీ మండల నాయకులు వత్సవాయి జానకి రాములు, పులి యజ్ఞనారాయణ, రౌతు అప్పారావు, కాటబత్తిన వీరబాబు, ఓబెనబోయిన అచ్చయ్య, లింగం కోటి, గడ్డం కోటేశ్వరరావు , బండి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మం నగరంలోని ఎఫ్‌సిఐ గౌదం వద్ద వచ్చే నెల 13న ఉదయం 10గంటలకు నిర్వహించనున్న బీసీ హక్కుల సాధన సమితి ఖమ్మం జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ అనుబంధ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెంలో గురువారం ఖమ్మం రూరల్ మండల బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ మహాసభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మహాసభకు బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, బీసీ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి బట్ట బాబు, ఉపాధ్యక్షులు చీమలదారి విశ్వనాథం, దొంతగాని రమేష్, నర్రా మునేష్, సహాయకార్యదర్శులు గోకినపల్లి రామ్మూర్తి, పసుపులేటి లక్ష్మయ్య, మేకపోతుల రమేష్, గణపరపు చిన్న వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ సీసీటీవీలతోనే నేరాల నియంత్రణ



ప్రజాపక్షం/పెనుబల్లి: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ మరియు ప్రజల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సీఐ సర్వయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వి.ఎం. బంజర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్ఐ షాకీర్ ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ సీసీటీవీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ సర్వయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేరాల నియంత్రణలోనూ, నేరస్థులను త్వరగా గుర్తించడంలోనూ సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామాలలోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అలాగే నేరాలు జరిగే అవకాశం ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 25 మంది సర్పంచులు తమ తమ గ్రామాల్లో కమ్యూనిటీ సీసీటీవీ వ్యవస్థల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం, పోలీసులతో సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నేరాల రహిత సమాజ స్థాపనకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సర్వయ్య, ఎస్ఐ షాకీర్‌తో పాటు మండల పరిధిలోని 25 మంది సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞానేష్‌కుమార్ రాజీనామాకై రాజీలేని పోరాటం

- ఓటు చోరీ క్షమించరాని నేరం
- నవంబర్ 1న ఛలో ఢిల్లీ.. జిల్లా నుండి 120 మంది
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం ః ఓటు చోరీ క్షమించరాని నేరమని, ప్రజా స్వామ్య విలువలను కాలరాసే హక్కు ఎవ్వరికీ లేదని, ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామాకై రాజీలేని పోరాటం సాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో నిర్వహించే ర్యాలీ నిరసన కార్యక్రమానికి జిల్లా నుండి 120 మందితో కూడిన సిపిఐ ప్రతినిధి బృందం తరలుతుందని చెప్పారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత కీలకమని, ప్రజా తీర్పును గౌరవించడం ప్రతీ వ్యవస్థ బాధ్యతన్నారు. ఓటు చోరీకి సంబంధించి విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై సుప్రీం కోర్టు ఇప్పటికే మొట్టికాయ మొట్టిందని, న్యాయస్థానాల సూచనలను పరిగణలోనికి తీసుకుని ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచాలన్నారు. ప్రజా స్వామ్య హక్కుల పరిరక్షణ కోసం వామపక్ష శ్రేణులు ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు రక్షణ ప్రజా స్వామ్య విలువల పరిరక్షణ ఎన్నికల వ్యవస్థలో జవాబుదారీతనం కోసం తమ పోరాటం కొనసాగిస్తామని పాషా పేర్కొన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలోనే పేదల సొంత ఇంటి కల సాకారం

గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/మణుగూరుః ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేద కుటుంబాల సొంత ఇంటి కల సాకారం అవుతుందని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మణుగూరు మండలం చెరువు సింగారం గ్రామంలో ఈసం రజిత నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈసం రజిత కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన గృహంలో వారి జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఒక కల అని, ఆ కలను సాకారం చేసుకోవడం ప్రతి కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగించే విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరుతోందని తెలిపారు. సొంత ఇంటితో కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవం, స్థిరమైన జీవనానికి భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబాల సొంత ఇంటి కల సాకారమై, వారి జీవితాల్లో నూతన వెలుగులు నిండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈసం రజిత కుటుంబం నూతన గృహంలో సుఖసంతోషాలతో జీవిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

వీబీజీ రామ్‌జీ పథకంపై మేట్లకు శిక్షణ

125రోజుల పని కల్పించడంపై ఎంపీడీవో సూచనలు



ప్రజాపక్షం/బూర్గంపాడు: వీబీ జీ రామ్ జీ పథకం అమలు, పనుల నిర్వహణపై మేట్లకు బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర రైతు వేదికలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ పథకం అమలులో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. రైతులు పశుగ్రాపం పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పశువుల తొట్టెలు, ఫామ్ పాండ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని సూచించారు. కుటుంబాలకు 125 రోజుల పని కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని, పథకంలో అందుబాటులో ఉన్న 375 రకాల పనులను గుర్తించి సీజన్లకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. పనులను నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని, పారదర్శకతను ప్రాధాన్యమిస్తూ ప్రజలకు పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. డీఆర్‌డీఏ రిసోర్స్ పర్సన్ రాజారత్నం మాట్లాడుతూ పథకానికి సంబంధించిన వివిధ విధానాలపై మేట్లు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పనుల నిర్వహణలో నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పనుల అమలులో అనుసరించి, గ్రామాల్లో పథకం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పినపాక, ఉప్పుసాక, మోరంపల్లిబంజర్, సోంపల్లి, వేపలగడ్డ, అంజనాపురం, నకిరిపేట గ్రామ పంచాయితీలకు చెందిన సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ వెంకట్, సంబంధిత గ్రామ పంచాయితీ సర్పంచులు, కార్యదర్శులు, అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సెమీ స్కిల్డ్ మేట్లు హాజరయ్యారు.

సురక్షిత బాల్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ప్రజాపక్షం/చుంచుపల్లిః సురక్షిత బాల్యాన్ని అందించడం, బాలల హక్కులను పరిరక్షించడం, వారిపై జరిగే నేరాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం. రాజేందర్ అన్నారు. సురక్షిత బాల్యం అభియాన్‌లో భాగంగా గురువారం బాబుక్యాంపులోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బాలల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి రాజేందర్ విద్యార్థులతో బాలల రక్షణ సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులకు పోక్సో చట్టం, బాలల హక్కులు, బాలలపై జరిగే నేరాల నివారణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా తెలియజేసేలా పాఠశాలల్లో సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. బాలల హక్కులను కాపాడటం, వారిపై జరిగే నేరాలను అరికట్టడం కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని న్యాయమూర్తి ఎం.రాజేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, న్యాయవాదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈఓ నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావైద్యం భూ సర్వేపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- వైద్యురాలికి షోకాజ్ నోటీస్



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ః ప్రభుత్వ వైద్య సేవలు విద్యా ప్రమాణాలు భూ రీ సర్వే పనులపై జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం రామవరంలోని మాతశిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన లక్ష్మీ దేవిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. చండ్రుగొండ మండల పరిధిలోని సీతాయిగూడెం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామవరం మెడికల్ ఆఫీసర్ డా. నాగమణి సకాలంలో విధులకు హాజరుకాక పోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠింగా వ్యవహరిస్తామన్నారు. ప్రతీ రోగికీ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో బోధనా విధానాన్ని పరిశీలించిన ఆయన విద్యార్థుల చదువులపట్ల ఉపాధ్యాయులు అత్యంత శ్రద్ధతో మెలగాలని సూచించారు. చాతకొండ ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు. విద్యార్థులతో మమేకమై పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం చండ్రుగొండ మండలంలోని సీతాయిగూడెం రెవెన్యూ గ్రామంలో చేపడుతున్న భూ రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

గ్రంథాలయాభివృద్ధికి ప్రత్యేక కృషి

- చైర్మన్ పసుపులేటి



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లాలో గ్రంథాలయాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పుసుపులేటి వీరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినపాక శాఖ గ్రంథాలయంలో నూతన గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన ఎంఎల్‌పి పాయం వెంకటేశ్వర్లు, ఐటిడిఏ పిఓ రాహుల్ జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి కే కరుణకుమారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయాలను విద్యార్థులు నిరుద్యోగ యువతకు విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారదాతల సమన్వయంతో జిల్లాలోని శాఖా గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తామని వీరబాబు వెల్లడించారు.

నిండా ముంచిన ఎల్‌నినో



ప్రజాపక్షం /గుండాల : ఆ రుగాల కష్టించి పండించిన పంట చేతికి అందినట్టే అంది ఎల్‌నినో ఎఫెక్టతో గత రెండు రోజులుగా కురిసిన చిరు జల్లులతో ఆరబెట్టిన మొక్కజొన్న పంట మొలకెత్తడంతో గుండాల తండాకు చెందిన ఆ రైతు బోరున విలపిస్తూ ఆవేదన చెందారు. వర్షాలు లేక వేసిన కొద్దిపాటి జొన్న పంటకు విద్యుత్ మోటార్లతో నీరు అందించి పంట చేతికి వచ్చిందనే ఆనందంతో పంటను ఆరబెట్టుకోగా ఎల్‌నినో ప్రభావం నిండాముంచ్చిందని , పంట దిగుబడి తక్కువ వచ్చిన జొన్న పంటకు మంచి ధర ఇప్పుడు ఉండటంతో తన కష్టాలు కొంత మేరకైనా తీరుతాయని కోటి ఆశలు పెట్టుకొగా తీర ఇలా జరిగిందని ఆవేదన చెందారు.ప్రభుత్వం ఒక పక్కా మండలాన్ని కరువు మండలంగా గుర్తించక పోవడం దురదృష్టకరమన్నారు. మండలంలో 90శాతం వ్యవసాయం పైనే ఆదారపడి జీవిస్తున్న రైతులు ఉన్నారు, జొన్నపంటపైనే ఎక్కువ రైతులు ఆశలు పెట్టుకొని , పంట చేతికి అందే క్రమంలో ఎల్‌నినో ప్రభావంతో కురిసిన వర్షాలకు జొన్నపంట పూర్తి స్థాయిలో దెబ్బతిన్న పరిస్థితి మండలంలో నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయినమెక్కజొన్న, పత్తి పంటలను మండల వ్యవసాయాదికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పరిహారం చెల్లించాలని మండల రైతులు కోరుతున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి



ప్రజాపక్షం/ఇల్లందు: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఇల్లందు ఎంఎల్‌పి కోరం కనకయ్య పిలుపునిచ్చారు. గురువారం ఇల్లందులో నిర్వహించిన ఓటరు నమోదు సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి మండలంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులందరూ రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి. కామ్ వెబ్ సైట్ ద్వారా ఫారం 6 దరఖాస్తుల నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. నవంబర్ 6లోగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకూడదని పేర్కొన్నారు. యువత సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడిగా రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి మద్దతుగా నివాలని, పట్టభద్రులను చైతన్యపరిచి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పోతు భాస్కర్, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, పాలేరు నియోజకవర్గ నాయకులు, మున్సిపల్ ఛైర్మన్, మార్కెట్ ఛైర్మన్, మార్కెట్ డైరెక్టర్లు, మండల, బ్లాక్, పట్టణ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నగరంలో పట్టణ ప్రణాళిక, భవన నిర్మాణ అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగరంలో లేఅవుట్లు రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) క్రింద వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారికి లేఅవుట్ అనుమతులు మంజూరు చేయాలన్నారు. అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత శాఖల అధికారులు లేఅవుట్ అనుమతుల పై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుల శాఖాధికారులు తప్పనిసరిగా పాల్గొని చెరువులు, నీటి వనరుల పరిధిలో ఎఫ్టిఎల్, బఫర్ జోన్‌లో ఎలాంటి అనుమతులు మంజూరు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా భవన నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తయిన భవనాలకు నిబంధనల మేరకు ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించి నగరంలో క్రమబద్ధమైన ప్రణాళికలు అమలయ్యేలా చూడాలన్నారు. నగరంలో కొనసాగుతున్న భూగర్భ మురుగు నీరు పారుదల పనులను వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలన్నారు. నగరంలో నిర్మాణంలో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టిపి) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని రహదారుల మధ్య డివైడర్లలో ఉన్న మొక్కలకు వినియోగించాలన్నారు. నగరంలో పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో నుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ మాయం.. వంటగదిలో అపరిశుభ్రత

-కోర్లగూడెం పాఠశాలలో డీఐఈఓ ఆకస్మిక తనిఖీ

-ఇంటర్ విద్యార్థులకు వారానికి మూడు కోడిగుడ్లు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండలం కోర్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మెనూ ప్రకారం భోజనం అందించకపోవడం, వంటగది అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులు యూనిఫామ్ లేకుండా కనిపించడంతో ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఒక్క జత యూనిఫామ్ మాత్రమే ఇచ్చారని వారు తెలపడంతో, పంపిణీలో జాప్యంపై ఐకేపీ ఏపీఎంను ఫోన్‌లో ప్రశ్నించి వెంటనే యూనిఫామ్ అందించాలని ఆదేశించారు. ఇటీవల కూలిన పాఠశాల ప్రహరీ గోడకు నిధులు మంజూరు చేసి, నిర్మాణ పనులు చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు స్పెషల్ ఆఫీసర్‌ను కోరారు. అనంతరం మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను రవిబాబు తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో బోధన తీరును గమనించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మారిన సిలబస్‌ను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని అధ్యాపకులకు సూచించారు. జిల్లాలోని 21 ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులకు వారానికి మూడు కోడిగుడ్లు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 5 వరకు జిల్లాలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, సర్పంచ్ కె.త్రివేణి, కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనకు పట్టభద్రులు బుద్ధి చెప్పాలి

2028లో కెసిఆర్ ప్రభంజనం చూస్తారు : తక్కెళ్లపల్లి రవీందర్






ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకంగా మారనున్నాయని ఉమ్మడి ఖమ్మంజిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ అన్నారు. గురువారం వైరాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆరేళ్లకొకసారి జరిగే ఈ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వ పనితీరుపై తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని రవీందర్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనపై పట్టభద్రులు తమ తీర్పు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో అధికార దుర్వినియోగం జరుగుతుందని, కాంగ్రెస్ పాలనపై విద్యావంతులు తమ ఓటు ద్వారా స్పందించాలని ఆయన వ్యాఖ్యానించారు. 2023లో కాంగ్రెస్‌ను చూశారు. 2028లో కెసిఆర్ ప్రభంజనం తీవ్ర స్థాయిలో ఉంటుందని రవీందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సాగునీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఎల్నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టులు నీటితో నిండుగా ఉంటే, తెలంగాణలోని ప్రాజెక్టులు నీరు లేక వెలవెలబోతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో భూములు నెర్రెలు బారుతున్నాయని విమర్శించారు. సాగునీటి సమస్యలపై రైతులే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం వైరాలో నూకల ప్రసాద్‌రావు ఇంటి వద్ద నిర్వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. శ్రీచైతన్య డిగ్రీ కళాశాల అధ్యాపక బృందంతో మాట్లాడి, అర్హులైన ప్రతి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి, లకావత్ గిరిబాబు, జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్ రావు, వనమా విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు దొంతెబోయిన వెంకటేశ్వర్లు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, బాణాల వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, భూమాల కృష్ణమూర్తి, కామినేని శ్రీనివాసరావు, మద్దెల రవి, బానోతు సక్కుబాయి, పాసంగులపాటి శివ, రాచబంటి బాలకృష్ణ, దాసరి శ్రీనివాసరావు, తిరుపతి శ్రీను, మిట్టపల్లి సత్యంబాబు, మిట్టపల్లి కిరణ్, వజినేపల్లి చక్రవర్తి, ఆదూరి ప్రేమ్‌కుమార్, గుజ్జర్లపూడి దేవరాజ్, వల్లభి శ్రీను, మొండెం కృష్ణంరాజు, మన్నెం సత్యానందం, వాసిరెడ్డి రవి, వాంకుడోత్ వీరన్న, బత్తుల రాజు, కుమార్తపు ప్రవీన్, వేముల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తోటి స్నేహితునికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి విజయ్ తల్లి ఆగ్నేశమ్మ ఇటీవల మృతిచెందారు. గురువారం దశదిన కర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1985 86 సంవత్సరంలో పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితుని తల్లి మరణించడంతో ఆర్థిక సాయంగా రూ. 35వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ స్నేహితులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు నివాళుర్పించిన మాజీ ఎంపిపి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, నర్సింహారావుపేట గ్రామాల్లో పలు కుటుంబాలను గురువారం తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గోళ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు పరామర్శించారు నర్సింహారావుపేట గ్రామంలో సుంకర బిక్షమయ్య భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా అన్నారుగూడెం గ్రామంలో వట్టికొండ పున్నారావు, సూద సీతమ్మ దశదిన కర్మలకు హాజరై వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో దుగ్గిదేవర వెంకటలాల్, పులి వెంకటనరసయ్య, తాళ్ల అగస్టీన్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకూబ్ ఉన్నారు.

నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



ప్రజాపక్షం/ తల్లాడ : నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తల్లాడ తహసీల్దార్ కరుణా కర్‌రెడ్డి, ఎంపిడిపో శ్రీధర్‌రాజు లు సూచించారు. గురువారం తల్లాడ మండలంలోని అన్నారు గూడెం గ్రామంలో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అధ్యక్ష తన ఎల్‌నినో పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గతంలో కరోనాను ఎలా ఎదుర్కొన్నామో ప్రస్తుతం ఎల్‌నినోను కూడా అదేవిధంగా ఎదుర్కొవాలన్నారు. అనంతరం తల్లాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బిజెపి నాయకులు రామారావు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు తుమ్మలపల్లి రమేష్, ఆనందరావు, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఏడో వార్డు ప్రజల ఆరోగ్యమే ముఖ్యం



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు చర్యలు చేపట్టారు. వీధి కుక్కల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కౌన్సిలర్ మున్సిపల్ కమీషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళతో మాట్లాడి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయించారు. ఈ బృందం ఏడో వార్డులో సుమారు 20 వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్ ఫణితి సైదులు తెలిపారు. ఇదే సమయంలో వార్డులో కోతుల బెడద కూడా అధికంగా ఉందని స్థానికులు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన వారం రోజుల్లో కోతులను పట్టించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారుల సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, పోటు మధు, ఫణితి నాగార్జున, ఫణితి సురేష్, శివయ్య, పాషా, మున్సిపాలిటీ సిబ్బంది పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో భర్తకు 3 ఏళ్ల జైలు

ప్రజాపక్షం/మధిర: వరకట్న వేధింపుల కేసులో మధిర కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఐదేళ్ల క్రితం నమోదైన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వేముల దీప్తి తీర్పునిచ్చారు. ఖమ్మం కమీషనరేట్ పరిధిలోని మధిర పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన సిసి నెంబర్ 237/2020 కేసు విచారణ మంగళవారం జరిగింది. ప్రభుత్వం తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.భద్రయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించి సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేశారు. ముద్దాయి ఏ1 షేక్ నాగులమీరాకు 498 ఏఐపిసి కింద 2 ఏళ్లు, వరకట్న నిరోధక చట్టం సెక్షన్ 3,4 కింద 6 నెలల చొప్పున మొత 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.17వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు జైలు శిక్ష ఉంటుందని కోర్టు పేర్కొంది. అదే కేసులో మిగిలిన 1న నుండి ఏ4 ముద్దాయిలను అన్ని సెక్షన్ల నుండి నిర్దోషులుగా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తీర్పుతో వరకట్న వేధింపులకు పాల్పడితే కఠిన శిక్ష తప్పదనేసంకేతంవెళ్లిందని వారు న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సోలార్ ప్లాంట్‌కు 6.10 ఎకరాల స్థలం అప్పగింత

ప్రజాపక్షం/నేలకొండపల్లి : విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజేశ్వరపురంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన 6.10 ఎకరాల ప్రభుత్వ స్థలానికి సంబంధించిన పత్రాలను గురువారం విద్యుత్ శాఖ ఏఈ నారాయణరావుకు సర్పంచ్ దండా రంగయ్య అందజేశారు. ప్లాంట్‌ను త్వరగా పూర్తి చేసి విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, సోలార్ విద్యుత్ ప్రయోజనాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని రంగయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపాలన అధికారి దామళ్ల జానకిరామయ్య, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.